సాక్షి
విశాఖపట్నం
7
సోమవారం । 28 । ఆగస్టు । 2023

దేశంలోనే అతి తక్కువ బంగారం ధర
22 kt. Gold Rate ₹ 5290/- per gram
దేశంలోనే అతి తక్కువ తరుగు
అన్ని బంగారు ఆభరణాలపై సింగిల్ డిజిట్ తరుగు
సంఘ్వీ
జ్యువెలరీ మాల్
ఆశీల్‌మెట్ట జంక్షన్, విశాఖపట్నం.

న్యూస్‌రీల్

కరాళ చందనం అరగదీత ప్రారంభం



కరాళ చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం కరాళ చందనం అరగదీతని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈనెల 31న శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సుమారు పది కిలోల కరాళ చందనాన్ని సమర్పిస్తారు. ఈ మేరకు కరాళ చందనం అరగదీతని చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

అరకు సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



శివలింగపురం నూతన టన్నెల్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలోని విశాఖపట్నం–అరకు సెక్షన్‌లో ఆదివారం డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ తనిఖీలు చేపట్టారు. అరకు–కొత్తవలస మధ్య జరుగుతున్న రెండవ ట్రాక్ పనులను పరిశీలించారు. శివలింగపురం ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న గుహను సందర్శించారు. పర్యటనలో భాగంగా టన్నెల్ నం.32, బ్రిడ్జి నం. 242 వద్ద విధి నిర్వహణలో ఉన్న ట్రాక్‌మన్ రామన్నతో ప్రత్యేకంగా మాట్లాడారు. కీలకమైన ఈ మార్గంలో.. ట్రాక్ నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, తమ వంతు కీలక పాత్ర పోషిస్తున్న ట్రాక్‌మన్‌లను ఆయన అభినందించారు. చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) కె.ధనుంజయరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మేట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

సీతమ్మధార: మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 14న నిర్వహించే మేట్ టెస్ట్–2023 మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఎల్.డేవిడ్ అన్నారు. ద్వారకానగర్‌లోని సంస్థ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. మొత్తం రూ.50 లక్షల మేర స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నామన్నారు. ప్రథమ విజేతకు రూ.50 వేలతో పాటు టాప్ ఐదు ర్యాంకులు సాధించిన విద్యార్థులు 50 శాతం రాయితీ పాటు ట్యాబ్, ల్యాప్‌టాప్, మొబైల్స్ అందజేస్తామన్నారు. వివరాలు కోసం 92487 53099, 91339 06555, 92478 66222లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెచ్ఆర్, రమ్యశ్రీ, మార్కెటింగ్ మేనేజర్ ఎం.శివ,దివ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో 1800 4250 0009కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

6 నుంచి స్కౌట్స్ జాతీయ ట్రెక్కింగ్

మద్దిలపాలెం: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6 నుంచి 12వ తేదీ వరకు జాతీయ ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశరావు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్, చమోలీలో 7 రోజుల పాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆరోగ్యవంతులైన 15 నుంచి 25 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులన్నారు. పూర్తి వివరాలకు 99081 86117లో సంప్రదించవచ్చు.

సాగరమాలలో రోజ్‌గార్ మేళా నేడు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురంలోని సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం రోజ్‌గార్ మేళా జరగనుంది. విశాఖపట్నం పోర్టు అథారిటీ, సీఐఎస్ఎఫ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మేళాకు ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి భగవత్ కుబా హాజరుకానున్నారు. ఈ మేళాలో ప్రభుత్వ రంగ సంస్థల్లో నూతనంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తారు.

కింగ్స్‌దే కిరీటం

- ఏపీఎల్–2 విజేత రాయలసీమ కింగ్స్
- రన్నరప్‌గా కోస్టల్ రైడర్స్
- వేడుకగా బహుమతుల ప్రదానోత్సవం



రాయలసీమ కింగ్స్ జట్టు కెప్టెన్ హనుమ విహారిని ఎత్తుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న సహచరులు

విశాఖ స్పోర్ట్స్: రాయలసీమ కింగ్స్ ఆటగాళ్లు అదరగొట్టారు. డిఫెండింగ్ చాంపియన్ కోస్టల్ రైడర్స్‌ను మట్టికరిపించారు. ఏపీఎల్ రెండో సీజన్‌లో చాంపియన్స్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించారు. పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఆదివారం రాయలసీమ కింగ్స్–కోస్టల్ రైడర్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారడంతో 18 ఓవర్లకు ఆట కుదించారు. తొలుత కోస్టల్ రైడర్స్ బ్యాటింగ్ చేయగా ఓపెనర్ ప్రణీత్(10) 38 పరుగుల వద్ద ఔటయ్యాడు. అతని స్థానంలో వచ్చిన కెప్టెన్ రషీద్ 12 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ ధరణీకుమార్ 30 పరుగుల వద్ద హనుమ విహారీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. తొలి పది ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. నాలుగో వికెట్‌కు హర్షవర్ధన్‌తో కలిసి చిరంజీవి(15) 50 పరుగుల భాగస్వామ్యాన్నందించారు. లేఖజ్‌రెడ్డి ఒక పరుగుతో పెవిలియన్‌కు చేరడంతో 15 ఓవర్లలో ఐదు వికెట్లకు 122 పరుగులే చేసింది. హర్షవర్ధన్(50) 5 ఫోర్లు, సిక్సర్‌తో అర్ధసెంచరీ చేసి సాకేత్ బౌలింగ్‌లో వినయ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చివర్లో 23 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. 18 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. కమరుద్దీన్ మూడు, హరిశంకర్ రెండు, వినయ్‌కుమార్, సాకేత్, హనుమ విహారీ ఒక్కో వికెట్ తీశారు. ప్రతిగా బ్యాటింగ్ దిగిన రాయలసీమ కింగ్స్ ఓపెనర్ వీరారెడ్డి డకౌట్ కాగా వంశీకృష్ణ 3 పరుగులతో వెనక్కి మళ్లాడు. మరో ఓపెనర్ సాయి శ్రావణ్ 24 పరుగులు చేశాడు. ఈ దశలో కెప్టెన్ హనుమ విహారీకి వినయ్‌కుమార్ తోడై నాలుగో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని అందించి పది ఓవర్లలో 97 పరుగులకు స్కోర్‌ను చేర్చారు. వినయ్‌కుమార్ 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 53 పరుగులతో వెనుతిరిగాడు. హనుమ విహారీ(46, 4 ఫోర్లు, 2 సిక్సర్లు), గిరినాథ్‌రెడ్డి (28, 1ఫోర్ 3 సిక్సర్లు) అజేయంగా నిలిచారు. వీజేడీ పద్ధతిలో 18 ఓవర్లకు కుదించి 157 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించగా.. 16.3 ఓవర్లలో 160 పరుగులతో కింగ్స్ విజయాన్నందుకున్నారు. స్టీఫెన్, ఆశిష్ రెండేసి వికెట్లు తీయగా అబ్దుల్లా ఒక వికెట్ తీశాడు.

విజేతలకు ట్రోఫీలందించిన సుబ్బారెడ్డి, శ్రీకాంత్

ఏపీఎల్ విజేత రాయలసీమ కింగ్స్‌కు వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి ట్రోఫీ అందించారు. రన్నరప్ కోస్టల్ రైడర్స్‌కు కృష్ణమాచారి శ్రీకాంత్ ట్రోఫీనందించారు. మోస్ట్ ప్రామిసింగ్ క్రీడాకారునిగా వీరారెడ్డికి గంగరాజు అందించగా బెస్ట్ ఫీల్డర్‌గా విజయ్‌కు మదన్‌లాల్ అందించారు. సూపర్ సిక్సర్ అవార్డును విహారీకి షరీఫ్, బెస్ట్ క్యాచ్ అవార్డును రషీద్‌కు విష్ణుకుమార్, మ్యాచ్ బెస్ట్ అవార్డును వినయ్‌కు ఓబుల్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, సీఈవో శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెస్ట్ ఫీల్డర్ విజయ్, మోస్ట్ ప్రామిసింగ్ క్రీడాకారుడు వీరారెడ్డి, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ వినయ్‌కు అవార్డులు అందజేస్తున్న మదన్‌లాల్, గోకరాజు గంగరాజు, ఓబుల్ రెడ్డి



పర్పుల్ క్యాప్, ఆరెంజ్ క్యాప్, ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డులు అందుకుంటున్న కింగ్స్ ఆటగాళ్లు



అభిమానుల సందడి



రన్నరప్ ట్రోఫీతో కోస్టల్ రైడర్స్ జట్టు

దేశానికి ప్రాతినిథ్యం వహించాలి



ఆంధ్రాలో ప్రతిభ ఉన్న క్రీడాకారులున్నారని.. వారిని ప్రోత్సహించేందుకు ఏపీఎల్ ప్లాట్‌ఫాం చక్కగా ఉపయోగపడుతుంది. రాబోయే రోజుల్లో ఆంధ్రా నుంచి మరింత మంది దేశానికి ప్రాతినిథ్యం వహించాలి. ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు ప్రోత్సాహం ఇందుకు దోహదపడుతోంది. ప్యాషన్‌తో ఆటను ఆస్వాదిస్తూ ముందుకు సాగాలి. అప్పుడే అంచెలంచెలుగా ఎదిగేందుకు అవకాశం వస్తుంది.

– కృష్ణమాచారి శ్రీకాంత్, మాజీ టెస్ట్ కెప్టెన్

ఏపీఎల్–2కు విశేష ఆదరణ



ఏపీఎల్–1 కంటే 2కు ఆదరణ చాలా పెరిగింది. అందుకు ఏపీఎల్–2 సీజన్ ఈ స్థాయిలో విజయవంతం కావడమే నిదర్శనం. ఆంధ్రాలో క్రికెట్ అభివృద్ధికి ఏసీఏ ఎంతో కృషి చేస్తుంది. వుమెన్ క్రికెట్ లీగ్‌ను ఆంధ్రాలోనే తొలిసారి నిర్వహించాం. మెన్, వుమెన్ క్రికెటర్లను ప్రోత్సహిస్తూనే అకాడమీలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని కేటగిరీల్లో క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఏసీఏ కృషి చేస్తుంది.

–ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్

ప్రతీ జిల్లాలో స్టేడియం

ఆంధ్రాలో క్రికెట్ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం. ప్రతీ జిల్లాలో స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు చేస్తున్నాం. ఏపీఎల్ ఈ ఏడాది మరింత విజయవంతమైంది. ఆటగాళ్ల వేలం నుంచి మ్యాచ్‌ల నిర్వహణ వరకు రాజీ లేకుండా చిత్తశుద్ధితో నిర్వహించాం. 70 వసంతాల ఏసీఏ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నాం. దానికి ముఖ్యఅతిథిగా బీసీసీఐ అధ్యక్షుడు రోజర్‌బిన్నీ రానున్నారు. ఆంధ్రా తరఫున క్రికెట్ ఆడిన వారిని, సేవలందించిన వారిని ఈ సందర్భంగా అభినందించనున్నాం.

– పి.శరత్‌చంద్రారెడ్డి, అధ్యక్షుడు, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్

జై మత్స్యకార.. జై జగనన్న!

- 31న హార్బర్ వద్ద మత్స్యకార మహాసభ
- ఉత్తరాంధ్ర నుంచి భారీగా హాజరు కానున్న మత్స్యకారులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పథకాలకు కృతజ్ఞతలు తెలపనున్న నేతలు
- 2003 ఏప్రిల్‌లో విశాఖలో ఈ తరహా సదస్సు
- నాటి సభకు ప్రతిపక్ష నేతగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాజరు



సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. అందుకుగాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పడానికి మత్స్యకారులు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 31న విశాఖ ఫిషింగ్ హార్బర్ వద్ద రాష్ట్రంలోనే తొలిసారిగా మత్స్యకార మహాసభను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 2003 ఏప్రిల్ 4న మత్స్యకారులు ఇలాంటి మహాసభనే విశాఖలో నిర్వహించారు. ఆర్కే బీచ్‌లో నిర్వహించిన ఆ మహాసభలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. సరిగ్గా ఇరవయ్యేళ్ల తర్వాత ఇప్పుడు 'జై మత్స్యకార.. జై జగనన్న' పేరిట మత్స్యకార మహాసభను నిర్వహిస్తున్నారు. 31 సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు జరిగే ఈ మహాసభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మత్స్యకారులు, మత్స్యకార నేతలు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మత్స్యకారుల బతుకులు ఎంతగానో మెరుగుపడ్డాయి. సముద్రంలో చేపలవేటపై రెండు నెలల పాటు నిషేధం అమలు సమయానికి వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద వీరికి రూ.10 వేలు చెల్లిస్తోంది. గత ప్రభుత్వంలో ఈ సొమ్ము రూ.4 వేలు మాత్రమే ఇచ్చేది. మత్స్యకార బీమా సొమ్మును రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో బోట్లకు సరఫరా చేసే డీజిల్‌పై లీటరుకు రూ.6 సబ్సిడీ ఇచ్చేది. అది కూడా ఆర్నెల్లు, ఏడాది తర్వాతో చెల్లించేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సబ్సిడీ సొమ్మును రూ.6 నుంచి 9కి పెంచడమే కాదు.. ముందుగానే మత్స్యకారుల ఖాతాలో రాయితీ మొత్తం జమ అవుతోంది. అంతేకాదు.. మునుపటి ప్రభుత్వంలా కాకుండా అన్ని మెకనైజ్డ్, మోటారు బోట్లకు ఈ రాయితీని వర్తింపజేస్తోంది. అలాగే రూ.152 కోట్ల వ్యయంతో విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ జరుగుతోంది. ఇలా సంక్షేమ పథకాలే కాకుండా మత్స్యకారుల జీవితాలు బాగు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పది ఫిషింగ్ హార్బర్లు, ఏడు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, పోర్టులను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా వేల సంఖ్యలో మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

హాజరుకానున్న మత్స్యకార నేతలు

మహాసభకు మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, తీరప్రాంత ఎమ్మెల్యేలు, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మత్స్యకార నేతలు హాజరు కానున్నారు. నాటి మత్స్యకార మహాసభలో వైఎస్‌తో పాటు మోపిదేవి, మల్లాడి కృష్ణారావులు పాల్గొనగా, 31న జరగబోయే మహాసభకు కూడా వీరిద్దరూ హాజరవుతుండడం విశేషం! ప్రజలకు, మత్స్యకారులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపడానికి, ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో ఈ మత్స్యకార మహాసభను ఏర్పాటు చేస్తున్నామని ఈ సభ నిర్వాహకుడు, రాష్ట్ర మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'కి చెప్పారు.

విశాఖ అభివృద్ధికి సీఎం జగన్ కృషి



జోడుగుళ్లపాలెంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీకి హారతులిస్తున్న మహిళలు

- వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- ఎంపీ ఎంవీవీకి జోడుగుళ్లపాలెంలో బ్రహ్మరథం

ఆరిలోవ: విశాఖపట్నం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదలతో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన అనంతరం తొలిసారిగా జీవీఎంసీ 9వ వార్డు పరిధి జోడుగుళ్లపాలెంలో ఆదివారం గడపగపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో కలిసి ఇక్కడ కొత్త అమ్మవార్ల ఆలయంలో పూజలు చేశారు. అక్కడే ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వందలాది మంది కార్యకర్తలతో కలిసి జోడుగుళ్లపాలెంలో ఇంటింటికీ వెళ్లి.. మహిళలు, యువకులు, వృద్ధులతో మాట్లాడారు. నాలుగున్నరేళ్ల కాలంలో వారికి అందిన సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఏఏ పథకాల వల్ల ఎంతెంత లబ్ధి పొందారో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. డప్పులు వాయిస్తూ.. పూలు చల్లుతూ నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ తూర్పు సమన్వయకర్తగా నియమితులైన ఎంపీ ఎంవీవీకి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఇప్పటికే బలంగా ఉందని, మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష లభిస్తోందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని వెల్లడించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తూర్పు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. 9వ వార్డు కార్పొరేటర్ స్వాతి, తూర్పు ఎన్నికల పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, మార్కెటింగ్ శాఖ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, పలు వార్డుల కార్పొరేటర్లు, ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.

'తెలుగుకు వెలుగునిచ్చిన గిడుగు'



చర్చాగోష్ఠిలో పాల్గొన్న వక్తలు, భాషాభిమానులు

ఏయూక్యాంపస్: తెలుగు భాషలో గ్రాంథిక వాదానికి స్వస్తి చెప్పి.. వ్యవహారిక వాదానికి శ్రీకారం చుట్టిన భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని విజయ నిర్మాణ సంస్థ అధిపతి డాక్టర్ ఎస్.విజయకుమార్ అన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ సూచనలతో ఆంధ్ర విశ్వ కళా పరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని వర్సిటీలో ఆదివారం చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ భాషాభివృద్ధి కోసం గిడుగు పిడుగై విజృంభించారన్నారు. తద్వారా వ్యవహారిక భాషను ప్రామాణిక భాషగా నిలిపి.. సామాన్యులకు చదువును దగ్గర చేశారన్నారు. విశ్రాంత ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ గిడుగు గ్రాంథిక భాషావాదులపై భాషోద్యమ యుద్ధం చేసి విజయం సాధించారన్నారు. గిరిజన భాషకు సముచిత స్థానం కోసం సవర భాష నేర్చుకుని.. ఆ భాషలో నిఘంటువు, వ్యాకరణ గ్రంథాలు రాసి అమరతుల్యుడిగా గిడుగు నిలిచారన్నారు. సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ గిడుగు వ్యక్తిత్వం చాలా గొప్పదన్నారు. శాస్త్రీయ దృక్పథంతో భాషను అధ్యయనం చేసి.. భాషలో సరళ సుందరమైన వ్యవహారికాన్ని ప్రజల భాషగా నిలిపారన్నారు. తెలుగు వెలుగు పత్రిక ద్వారా భాషాంశాలు ప్రజలకు చేరువయ్యేలా ప్రయత్నించారన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త కన్న య్య, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ నేమాని శారద, డాక్టర్ డి.ప్రవీణ, డాక్టర్ మేడా మస్తాన్‌రెడ్డి, డాక్టర్ మరదాన సుబ్బారావు, ఎ.రామకృష్ణ, డాక్టర్ ఎస్.పోలయ్య, నండూరి రామకృష్ణ, చింతా ప్రభాకర్, డాక్టర్ దేవులపల్లి పద్మజ, డాక్టర్ జి.మాలతి, డాక్టర్ సి.నిర్మలాదేవి, జె.పి.శర్మ, మణి, కె.వి.సత్యనారాయణమూర్తి, ఉప్పల అప్పలరాజు, స్నాతకోత్తర విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

బస్ బేకు మరమ్మతులు



బస్ బేకు మరమ్మతులు చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది


సీతమ్మధార: ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక.. సెంట్రల్ పార్కు ఎదురుగా నూతనంగా నిర్మించిన బస్ బే శనివారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ఆదివారం అధికారులు మరమ్మతులు చేశారు.

ఏయూలో గోపీచంద్ సినిమా షూటింగ్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం వద్ద ఆదివారం గోపీచంద్ నటిస్తున్న సినిమా షూటింగ్ జరిగింది. వర్సిటీకి సెలవు కావడంతో విద్యార్థులు లేరు. దీంతో ప్రశాంత వాతావరణంలో షూటింగ్ జరిగింది. పాఠశాల విద్యార్థులతో కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగం వద్ద సినిమా కోసం శ్రీ శారద విద్యా మందిర, చంద్రగిరి అంటూ బోర్డును అమర్చారు. స్థానిక ప్రజలు, కొంత మంది విద్యార్థులు షూటింగ్‌ను తిలకించారు.

కేజీహెచ్‌లో సేవలు సంతృప్తికరం

ఆస్పత్రిలో రోగులను పరామర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



రోగులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్యుల తీరు, అందిస్తున్న వైద్యం, భోజనంపై రోగులతో మాట్లాడి ఆరా తీశారు. ఆర్థో విభాగంలో రోగులతో మాట్లాడుతున్న సమయంలోనే టీడీపీ నాయకుడు సివేరి దొన్నుదొర రావడంతో ఇద్దరూ కలిసి ఇటీవల బస్సు ప్రమాద బాధితులను పరామర్శించారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తెలియజేయాలని దొన్నుదొరకు సూచించారు. అనంతరం సుభద్ర విలేకరులతో మాట్లాడుతూ కేజీహెచ్‌లో ప్రస్తుతం రోగులకు అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సహకారంతో కేజీహెచ్‌లో అనేక మార్పులు తీసుకొచ్చామన్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించడంలో, రోగులకు వైద్య సేవలు అందించడంలో, ఎస్టీ సెల్‌ను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడంలో విజయం సాధించామన్నారు. ఎవరికైనా సాయం చేయడానికి తనవంతు ప్రయత్నిస్తా అని సుభద్ర అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పదవి లభించిందని, ఆ అధికారం సాయంతో గిరిజనులకు సేవ చేస్తానన్నారు. గతం కంటే ఏజెన్సీ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు.

బీచ్‌రోడ్డులో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

అల్లిపురం: బీచ్ రోడ్డు గోకుల్ పార్కు వద్ద ఆర్కేబీచ్ నుంచి సింహాచలం వెళుతున్న 28వ నంబర్‌గల ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు గోకుల్ పార్కు వద్ద అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకుపోయింది. దీంతో రోడ్డు పక్కన పార్కు చేసిన మూడు బైకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. బైకులతో పాటు విద్యుత్ స్తంభం కూడా విరిగి పోయింది. ఆ సమయంలో బీచ్‌రోడ్డులో తక్కువ స్థాయిలో జనసంచారం ఉండటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. మహారాణిపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని చిన్నారి దుర్మరణం



హరిలీనాపాల్ (ఫైల్)

మర్రిపాలెం : తల్లితో పాటు ఆటో ఎక్కేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో అటుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ చిన్నారి మృతి చెందిన ఘటన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మాధవధార కళింగనగర్‌లో తల్లిదండ్రులతో నివసిస్తున్న హరిలీనా పాల్ (4) శనివారం సాయంత్రం తల్లితో కలిసి తాటిచెట్లపాలెం దరి సంజీవయ్య కాలనీలో ఓ చర్చికి ప్రార్థనకు వెళ్లింది. ప్రార్థన ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కడానికి రోడ్డు దాటుతున్న క్రమంలో తిక్కవానిపాలెం వద్ద అతివేగంగా వస్తున్న ఓ ద్విచక్రవాహనం చిన్నారిని బలంగా ఢీకొంది. చిన్నారి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారు. మెరుగైన చికిత్స కోసం వేరే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కేజీహెచ్‌లో ఆదివారం సాయంత్రం పోస్ట్ మార్టం నిర్వహించారు. తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బీఎస్ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురువర్యా.. చర్చిద్దాం రండి !

- 30, 31 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- విద్యాకార్యక్రమాల అమలుపై విస్తృత సమీక్ష
- టీచింగ్, లెర్నింగ్ కేంద్రాలుగా సీఆర్‌సీలు బలోపేతం
- తొలిసారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ సమావేశాలు



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు (ఫైల్)

విశాఖ విద్య : స్కూల్ కాంప్లెక్స్‌లను బలోపేతం చేసేలా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. విద్యార్థుల చదువులకు పాఠశాల స్థాయిలోనే పటిష్టమైన పునాదులు వేసేలా బోధనలో వినూత్నమైన పద్ధతులు అవలంభిస్తున్నందున, ఉపాధ్యాయుల భాగస్వామ్యం పెంచటం ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే ఉద్దేశంతో కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేలా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశాలు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. తొలిసారిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ కాంప్లెక్స్ సమావేశాలు సైతం నిర్వహిస్తుండటం ద్వారా పాఠశాలల్లో క్రీడా విద్యకు పెద్దపీట వేసే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయులు అంటున్నారు.

కాంప్లెక్స్‌ల నిర్వహణకు ప్రత్యేక నిధులు

జిల్లాలో 54 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఎంపిక చేసిన హైస్కూల్ కేంద్రంగా జరిగే కాంప్లెక్స్ సమావేశానికి ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని సమీప పాఠశాలల నుంచి 40 నుంచి 50 మంది వరకు ఉపాధ్యాయులు హాజరవుతారు.

ఉపాధ్యాయులకు శిక్షణ, బోధనోపకరణాల తయారీ కాంప్లెక్స్ కేంద్రాలుగానే జరుగుతాయి. కాంపెక్స్ చైర్మన్‌గా ఉన్న హెచ్‌ఎం పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. వీటి నిర్వహణకు ఏడాదికి రూ.25 వేలు ప్రభుత్వం ప్రత్యేకంగా మంజూరు చేస్తుంది. క్లాంప్లెక్స్ స్థాయిలో ప్రతీ నెలా నిర్వహించే సమావేశాలకు ఈ నిధులను వినియోగించుకునేలా అవకాశం కల్పించారు.

సమీక్ష ఇలా..

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఉదయం 9 నుంచి 5 గంటలకు వరకు జరుగుతుంది. వందేమాతరం గీతాన్ని ఉపాధ్యాయులంతా ఆలపించాలి. అనంతరం డీఈవో ఉపన్యాసం ఉంటుంది. 9.30కు ఎఫ్ ఏ-1 పరీక్ష నిర్వహణపై సమీక్ష ఉంటుంది. బోధన పద్ధతుల్లో అవలంభించే వివిధ వద్ధతులు, వాటికి వినియోగించే బోధనోపకరణాలపై చర్చిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం గత నెలలో నిర్వహించిన కార్యక్రమాలు, రాబోయే నెలలో వాటిని మరింత విజయవంతంగా నిర్వహించటంలో అవలంభించిన అంశాలపై చర్చిస్తారు.

విద్యా కార్యక్రమాలపైనే చర్చ

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో కేవలం విద్యా సంబంధిత కార్యక్రమాలపైనే చర్చించాలి. ఉపాధ్యాయ సంఘాల సమావేశం, సర్వీసు పరమైన అంశాలు, బదిలీలు, పదోన్నతుల సన్మానాలు వంటివి నిర్వహించకూడదు. ఎటువంటి వ్యక్తిగతమైన కార్యక్రమాల దీనిలో చర్చించడానికి వీల్లేదని విద్యాశాఖాధికారులు స్పష్టం చేశారు.

ఇలాంటి సమీక్షలు ఎంతో అవసరం



విద్యా కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కాంప్లెక్స్ సమావేశాలు కీలకంగా పనిచేస్తాయి. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులంతా ఒక చోట రోజంతా కూర్చొని చర్చించటం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు దోహదపడుతుంది.

– ఇమంది పైడిరాజు, అడవివరం కాంప్లెక్స్ చైర్మన్

విద్యాభివృద్ధికి దోహదం



కాంపెక్స్‌లను పటిష్టం చేయడం వల్ల విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. కాంప్లెక్స్‌ల నిర్వహణ ఇప్పటి వరకు అస్తవ్యస్తంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటిని ఏమాత్రం పట్టించుకోలేదు. విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం సమూల మార్పులకు సిద్ధం కావడం ఎంతో మంచి పరిణామం.

– చొక్కాకుల సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు

పాఠశాలల్లో కుల, మత ప్రస్తావనలు వద్దు

విశాఖ విద్య: పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఇతర ఎలాంటి విద్యా సంస్థల్లోనైనా కుల, మత ప్రస్తావనలు తీసుకురావద్దని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పష్టం చేసింది. కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బాలల అభ్యున్నతి దృష్ట్యా రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాలల్లో కుల, మత ప్రస్తావనలు తెచ్చే ఉపాధ్యాయులు, సిబ్బందిపై కమిషన్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లా ల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇటువంటి వాటిపై కమిషన్ తీవ్రంగానే పరిగణిస్తుందన్నారు. కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇటువంటి వాటిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు తగిన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైనట్లతై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు apscpcr 2018@gmail.comకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సన్నాయి మేళంలో మేటి శ్రావణి



సన్నాయి వాయిస్తున్న శ్రావణి.. హార్మోనియం వాయిస్తున్న ఆమె కుమారుడు

డాబాగార్డెన్స్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషులతో సమానంగా ప్రతి రంగంలోనూ తమకంటూ ఓ ముద్ర వేసుకుంటున్నారు. ఇంత వరకు కళా రంగంలో పాటలు పాడడం..నృత్యాలు వేయడం చూశాం. తాజాగా నగరానికి చెందిన తాటి శ్రావణి సన్నాయి మేళంలో తనకంటూ ఓ ముద్ర వేసుకున్నారు. విజయనగరంలో తర్ఫీదు పొందిన శ్రావణి విశాఖలో ఎక్కడ ఏ శుభకార్యం జరిగినా తనదైన శైలిలో సన్నాయి వాయిస్తూ పలువుర్ని ఆకట్టుకుంటున్నారు. భర్త ఆదినారాయణ కనకమహాలక్ష్మి దేవస్థానంలో డోల్ వాయిస్తుంటాడు. భర్త, అత్త ఈ వృత్తినే నమ్ముకున్నారు. శ్రావణి తల్లి తరుపు బంధువులంతా ఉద్యోగులే. భర్త ఆదినారాయణ వృత్తికి శ్రావణి తోడైంది. నాలుగేళ్లుగా సన్నాయి వాయిస్తూ భర్తకు చేదోడు వాదోడుగా ఉంటోంది. అలాగే వీరికి ఇద్దరు కుమారులు. కుమారులిద్దరూ విద్యనభ్యసిస్తూ సెలవు రోజుల్లో శుభకార్యక్రమాలకు వెళ్తుంటారు. కుమారులిద్దరూ హార్మోనియం వాయిస్తున్నారు. ఆదివారం నగరంలోని ఓ ఇంట జరిగిన పెళ్లికి ఆమె సన్నాయి వాయిస్తూ సాక్షి కంటపడ్డారు.



బీచ్‌రోడ్డు: సందర్శకులతో ఆదివారం పర్యాటక ప్రదేశాలు సందడిగా కనిపించాయి. ముఖ్యంగా సాగరతీరం సందర్శకులతో కిటకిటలాడింది. వాతావరణం చల్లగ ఉండటంతో కుటుంబ సమేతంగా తీరానికి చేరుకొని సందడి చేశారు. యువతీ యువకులు సెల్ఫీలు తీసుకొని జ్ఞాపకాలను భద్రపర్చుకుంటే చిన్నారులు అలలతో ఆడుకుంటూ జాలీగా గడిపారు. మరో వైపు సాగరతీరం రాత్రి సమయంలో విద్యుత్ వెలుగు మధ్య జాతరను తలపించింది. సందర్శకుల తాకిడి ఎక్కువ అవ్వడంతో బీచ్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయింది.

బాలికపై లైంగిక దాడి!



నిందితుడు పోలరెడ్డి

మర్రిపాలెం(విశాఖ ఉత్తర): ఎనిమిదేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెడ్డి కంచరపాలేనికి చెందిన పోలరెడ్డి(57) ఎలక్ట్రీషియన్. ఆయనకు భార్య పిల్లలు ఉన్నారు. స్థానికంగా ఉన్న చిన్నారులు ఆడుకునేందుకు అతడి వద్దకు వెళ్తుంటారు. శనివారం మధ్యాహ్నం ఎనిమిదేళ్ల చిన్నారి అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్తానని చెప్పి అతడు వద్దకు ఆడుకునేందుకు వెళ్లింది. అందరి చిన్నారులతోపాటు అతడి వద్ద ఆడుకుంది. రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వచ్చిన చిన్నారి ఏడుస్తుండగా తల్లి ఏమి జరిగిందని అడిగింది. పోలరెడ్డి తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు చెప్పింది. దీంతో బాలిక తల్లి కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న దిశ ఏసీపీ వివేకానంద, సీఐ నిర్మల, కంచరపాలెం సీఐ ఎస్. సాయి ఆదివారం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలరెడ్డిని అదుపులోకి తీసుకొని దిశ పోలీసులకు అప్పగించారు. దిశ ఏసీపీ వివేకానంద కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం బాలిక కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. బాలిక తండ్రికి రెండు కాళ్లు లేకపోవడంతో ఇంట్లో ఉంటుండగా.. తల్లి చెత్తలు ఏరుకునే పనులు చేస్తోంది.

బొమ్మ బ్లాక్‌బస్టర్



వైజాగ్ స్క్వేర్ పెయింటింగ్ వేస్తున్న కళాకారులు

బీచ్‌రోడ్డు: నగరానికి నూతన శోభను తీసుకొచ్చిన వైజాగ్ స్క్వేర్‌ను పలువురు పెయింటింగ్ కళాకారులు కాన్వాస్‌పై అద్భుతంగా చిత్రీకరించారు. అర్బన్ స్కెచర్స్, వైజాగ్ ఆధ్వర్యంలో ఆదివారం సిరిపురంలోని వైజాగ్ స్క్వేర్ వద్ద సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకురాలు ప్రీతి సంగీత మాట్లాడుతూ అర్బన్ స్కెచర్స్ వైజాగ్ 23 వారాలుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి.. అక్కడి ఆకర్షణీయమైన ప్రదేశాలు, భవంతులు, కళాఖండాలను గీసేలా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. ఆన్‌లొకేషన్ స్కెచింగ్ కళను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

చంద్రయాన్-3లో మనోడు



పప్పల వెంకట ముత్యాలనాయుడు

కంచరపాలెం: ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా ఆనందిస్తుండగా.. ఈ మిషన్‌లో ఐటీఐ జంక్షన్ భవానీగార్డెన్స్‌కు చెందిన పప్పల వెంకట ముత్యాలనాయుడు తన వంతు పాత్ర పోషించడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోర్ట్ విశ్రాంత ఉద్యోగి పప్పల అప్పలనాయుడు, వెంకటరత్నం మొదటి కుమారుడైన ముత్యాల నాయుడు ఆంధ్రా యూనివర్సిటీలో బి.టెక్ పూర్తి చేశాడు. బిట్స్ పిలానీలో ఎం.టెక్ చదివాడు. సుమారు పదేళ్ల కిందట ఇస్రోలో చేరిన ముత్యాలనాయుడు ప్రస్తుతం తిరువనంతపురంలో పనిచేస్తున్నాడు. కాగా.. తమ కుమారుడు చంద్రయాన్-3 విజయంలో భాగస్వామం కావడం ఆనందంగా ఉందని ముత్యాలనాయుడు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, శ్రీస్టార్ వాకర్స్ సభ్యులు ముత్యాలనాయుడిని అభినందించారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్



అప్పన్న ఆలయంలో కేంద్రమంత్రి భగవంత్ ఖుభా



సింహగిరిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ కనిమొళి, సభ్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆదివారం కేంద్ర మంత్రి భగవంత్ ఖుభా, రూరల్ డవలప్‌మెంట్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ కనిమొళి కరుణానిధి, సభ్యులు, భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రాన్ని త్రిమూర్తులు అందజేశారు. పీఆర్‌ఓ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి



దుర్గ (ఫైల్)

పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన మాసవరపు చైతన్యకు రావికమతం మండలం గంపవానిపాలేనికి చెందిన దుర్గతో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. దుర్గ, ఆమె భర్త చైతన్య, అత్తమామలు రాము, లక్ష్మి ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లి ఆదివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. కొద్దిసేపటి తర్వాత అందరూ నిద్రపోగా... దుర్గ మాత్రం ఇంట్లోని ఓ గదిలోని ఇన్వర్టర్‌ను శుభ్రం చేయడానికి వెళ్లింది. శుభ్రం చేస్తున్న సమయంలో విద్యుత్ వైర్ చేతికి తగలడంతో షాక్‌కు గురై పడిపోయింది. కొద్ది సేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు దుర్గను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు తమ కుమార్తె మరణం అనుమానాస్పదంగా ఉందని, దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దుర్గ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు.

రెడ్డి జేఏసీ నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న రెడ్డి జేఏసీ కార్యవర్గం

సీతమ్మధార (విశాఖ ఉత్తర): పూర్వం నుంచి రెడ్డి సామాజిక వర్గం సామాజిక సేవలు చేయడంలో ముందుంటారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం డైమండ్ పార్కు వద్ద ఓ హోటల్‌లో కార్యక్రమంలో రెడ్డి సంయుక్త కార్యచరణ కమిటీ నూతన అధ్యక్షుడిగా విప్పల శివకుమార్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తారతమ్యభేదాలు లేకుండా అర్హులందరకీ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు.

శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశ,విదేశాల్లో ఉన్న రెడ్డిలను ఏకతాటిపైకి తీసుకువచ్చి రెడ్డిల అభ్యున్నతికి పాటుపడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్ సలహాదారుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి , జేఏసీ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణరెడ్డి, ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జాతీయ అధ్యక్షులు బాల బ్రహ్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఈసీ మెంబర్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ప్రొఫెసర్ తిమ్మారెడ్డి, రెడ్డి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శేషాద్రిరెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షులు సరోజీ రెడ్డి, ప్రధాన మహిళా కార్యదర్శి సుజాత రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయ లోకానికి దిక్సూచి సింహాద్రప్పడు



సింహాద్రప్పడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవి

మురళీనగర్ : ఉపాధ్యాయ ఉద్యమ సింహం, ఉపాధ్యాయ సంక్షేమానికి తన జీవితాన్ని అంకితం చేసిన దివంగత గుల్లిపల్లి సింహాద్రప్పడు ఉపాధ్యాయ లోకానికి దిక్సూచిలాంటి వారని ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. సింహాద్రప్పడు సంస్మరణ కార్యక్రమాన్ని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మర్రిపాలెం అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు కొటాన శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం అలుపెరుగని నాయకుడిగా పోరాట చేశారని ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని ఆయన చెప్పారు. ఆయన సేవలు ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయులు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కష్టాలను తీర్చే నాయకుడిగా సింహాద్రప్పడు ఉపాధ్యాయుల గుండెల్లో నిలిచిపోయారన్నారు. భోపాల్ ప్రాంతీయ విద్యా సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రొఫెసర్ బుర్రా రమేష్ బాబు "విద్య-జ్ఞాన ప్రయివేటీకరణ" అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు, విశాఖ జిల్లా కార్యదర్శి తమలాల రామకృష్ణ , అనకాపల్లి జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి సన్యాసినాయుడు, ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావుల జగన్‌మోహనరావు, కొర్రా ధనుంజయ్, విశాఖ అర్బన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిరిపురపు పెద్దినాయుడు, డి.శ్రీనివాస్, డీటీఎఫ్ రాష్ట్ర క్యాదర్శి మధు, విజయనగరం జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జోగినాయుడు, ఆడారి కిషోర్ కుమార్, వెయ్యిమందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్విమ్మింగ్ కోచ్ మృతి



సతీష్ (ఫైల్)

తగరపువలస: బీచ్‌రోడ్డులో మార్లిన్ క్లే హోటల్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వాడమొదలు సతీష్ (27) ఆదివారం మృతి చెందాడు. భీమిలి బోయ వీధికి చెందిన సతీష్ నగరంలోని నోవాటెల్ హోటల్‌లో స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధు లు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా బీచ్‌రోడ్డులో సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యాడు. భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం మధ్యాహ్నం ఆటో లో ఇంటికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసును భీమిలి ఏఎస్‌ఐ జి.సత్తిబాబు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

- 1645 Sft. Flat No. 202 for Sale అల్లిస్ అపార్ట్‌మెంట్ మిథిలాపూర్ కోలనీ, విశాఖపట్నం. ఫోన్ : 92900 76667 [V- 797301]
- 3 BHK East facing Flat in Madhavadhara, 1835 Sq.ft @ 5,750/ Sqft. 3rd floor. No Brokers. Whatsapp: 7093880338 [WB-22934]
- 3BHK 1475 Sft రీసేల్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. ఎండాడ విశాఖపట్నం కావలసినవారు సంప్రదించండి : 8885252404. [C-777008]

PLOT FOR SALE

- 220 గజాలు సైడ్ బై సైడ్ 2 ప్లాట్స్ వెస్ట్ ఫేసింగ్ ఉడా అప్రూవ్ 2 ప్లాట్లు అమ్మకంనకు కలదు. తగరపువలస, విశాఖపట్నం. ఫోన్ : 92900 76667 [V- 797302]
- 4 లక్షలకే 100 గజాలు బిట్టు, GVMC పరిధిలో 133, 200 చ॥గ॥లు 90 బిట్లు, దగ్గరలో ఇల్లులు, బస్సులు, మార్కెట్, EMI కలదు. ఫోన్ : 70936 32399, 73864 14017 [V-794484]
- ఆనందపురం ఫ్లవర్ మార్కెట్ దగ్గర VMRDA ప్లైట్స్ అతితక్కువ ధరలో మరియు విజయనగరం ఐనాడ జంక్షన్ హైవే దగ్గర, 5th బెటాలియన్ ఎదురుగా రెడీ టు కన్‌స్ట్రక్షన్ సైట్ లోన్ సౌకర్యంతో కలవు. ఫోన్ : 93934 93936 [V- 2817]
- 240Sq. Yd. West Facing Plot at Nagavaram 60Feet Road Facing Near Atchyutapuram Vizag. Ph: 9849543876 [HA-11740]

SITE FOR SALE

- Site For Sale at Akkayyapalem Near Sai Baba Temple. 133 Sqyds, (Old House) N/F, Size 30x40. Ph : 88941 99419 [V-653]

Services

BUSINESS OFFER

- Sipra కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను. మంచి జీతం+కమీషన్. Cell: 9990752820. [T-1225444]

GOLD LOANS

- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10987]
- బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788212]

Wanted

- Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]
- హౌస్ కీపింగ్స్ కావలెను. జీతం 9,000/- + 4 రోజులు 10, 200/- AITC కంపెనీ 5వ లైన్, ద్వారకానగర్, వైజాగ్-16. ఫోన్ : 94408 02452, 62811 60029 [V-1038]
- మా షోరూమ్‌లో పనిచేయుటకు సేల్స్‌మెన్స్, వాచ్ మెకానిక్స్, హెల్పర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్. వివరాలకు టైం ల్యాండ్, వాల్తేరు మెయిన్ రోడ్డు, గ్రీన్ పార్క్ హోటల్ దగ్గర, వైజాగ్. ఫోన్ : 83310 34343 [N-11511]

LOSS OF PASSPORT

I, Amal Antony, S/o of Antony KJ, residing at Arjun Block, INHS Kalyani, Gandhigram Post, Vishakhapatanam-530011. I lost my passport bearing No-01613225 while traveling from my work to SCINDIA on 08 Aug 23. If found please contact Phone 7738623865

- మ్యారేజ్ బ్యూరో నందు పనిచేయుటకు అమ్మాయి కావలెను. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పనిచేసే అమ్మాయి కావలెను. 8341220970 [K-1185590]
- Wanted Marketing, Executives, Telle Callers, Helplers, Drivers. Hmart India Jagadamba, Vizag. Cont : 90323 25999 [V-11020]
- వైజాగ్ శుభగృహ కంపెనీ నందు పనిచేయుటకు యువకులు కావలెను. అర్హత : 10th -Degree /P.G, వయసు : 21 - 35 సం॥ లోపు, జీతం : 15 - 22 వేలు + ఇన్సెంటివ్స్ & కమీషన్, హాస్టల్ కలదు. సంప్ర : 99638 41555 [V- 11682]
- హరేకృష్ణ హోంకేర్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/కావలెను. ఫ్రీ వసతి+భోజనం.జీ:18K. హైదరాబాద్ ఫోన్: 9640258899, విజయవాడ:9640648899 [H-189325]
- Wanted Male Class incharges and Marketing Executives Qualification any Degree Age limit: 20 to 45 years, place of work Master Minds College, Gajuwaka, Vizag, Salary negotiable. Contact: 8008556073 [G-4592]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జీ.ఎస్.టి. అదనం